క్లుప్తంగా

విజేతలకు బహుమతుల అందజేత



బహుమతులు అందుకున్న విద్యార్థులతో విద్యుత్ శాఖ ఏఈ నరేష్, సిబ్బంది

రావులపాలెం: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన 12 మంది విజేతలకు ఏఈ పి.నరేష్, ఇతర సిబ్బంది బహుమతులు అందజేశారు.

సమన్వయంతో పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అయినవిల్లి: ప్రజాసమస్యలు పరిష్కరించేటప్పుడు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా సమస్యలను అధికారుల వద్ద తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని, అలా అని అధికారులతో వివాదాలకు దిగవద్దన్నారు. అలాగే ప్రజాప్రతినిధులు తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. ఖాళీగా ఉంచవద్దని సూచించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు తాము శాఖల పరంగా అందించిన పురోగతిని వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీడీఓ జి.భీమారావు, తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, ఈఓపీఆర్డీ వాణిశ్రీ బెహర తదితరులు ఉన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం అందజేత

అయినవిల్లి: మండలంలోని చింతనలంకలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు అమలాపురం పట్టణానికి చెందిన వేంకటేశ్వర డిగ్రీ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కేవీఆర్ఎస్ నరసింహారావు సమకూర్చిన నూతన వస్త్రాలను సోమవారం స్థానిక జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు గంగుమళ్ల అన్నపూర్ణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. తాత్కాలిక వసతులకు కొంత నగదు అందజేశారు. అన్నపూర్ణ మాట్లాడుతూ సమాజంపై బాధ్యత కలిగి ఉండాలన్నది పాత్యాంశంలో భాగమే అన్నారు. అమలాపురం వేంకటేశ్వర డిగ్రీ కళాశాల యాజమాన్యం సేవల ద్వారా అందుకు నిదర్శనమన్నారు. సేవా రత్న కరాటం ప్రవీణ్, ప్రిన్సిపాల్ కె.మనోహర్, యాలంగి వరప్రసాద్, చోడే జాన్‌పాల్, సూరజ్, కె.శ్రావణ్ దిలీప్‌పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆధునిక వేమన శతకం అందజేత

ఆలమూరు: మండలంలోని చింతలూరులో సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పుస్తకాల అందజేత జరిగింది. ప్రముఖ కవి, రచయిత, ప్రచురణకర్త కడిమిళ్ల వరప్రసాద్ ముద్రించిన ఆధునిక వేమన శతకం, శిష్య శతకం పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందడానికి శతక సాహిత్యం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. నేటి విద్యార్థులు మాతృభాషకు దూరమవడం వల్ల నైతిక విలువలతో కూడిన విద్య అందకపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. పుస్తకాలను ప్రచురించడంతో పాటు పుస్తక విజ్ఞానం విద్యార్థులందరికీ చేరాలనే సదాశయంతో ప్రాథమిక పాఠశాల, హైస్కూల్ విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేయడం కవి, రచయిత కృష్ణకుమార్ గొప్పదనానికి నిదర్శనమని ఎంఈఓ భమిడి పాటి అప్పాజీ అన్నారు.

క్షణముక్తేశ్వరుని సన్నిధిలో సినీనటి మాలశ్రీ

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరంలో కొలువైన క్షణముక్తేశ్వరస్వామిని సినీనటి మాలశ్రీ సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు శివరామకృష్ణ ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మాలశ్రీ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆమెకు ఆలయ చరిత్రను వివరించి, స్వామివారి ప్రసాదం అందజేశారు.

భవన నిర్మాణానికి చర్యలు

కొత్తపేట: స్థానికంగా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించనున్న బ్లడ్ బ్యాంక్ స్టోరేజ్ భవన నిర్మాణానికి తమ పరిధిలో తగు చర్యలు తీసుకుంటామని ఆర్డీవో పి.శ్రీకర్ హామీ ఇచ్చారు. ఇప్పటికే బ్లడ్ బ్యాంక్ స్థల సేకరణ జరిగి నిధులు మంజూరు కాగా భవన నిర్మాణానికి సహకారం అందించవలసిందిగా ఆర్డీవోను జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నారాయణరావు ఆధ్వర్యంలో సభ్యులు కోరారు. ఆ మేరకు స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవోను కలసిన వారు దాతల సహకారంతో బ్లడ్ బ్యాంక్ స్టోరేజీ భవన నిర్మాణం తలపెట్టగా ప్రభుత్వ నిధులు మంజూరు చేయడం జరిగిందని ఆర్డీవోకు వివరించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కొత్తపేట, రామచంద్రపురం డివిజన్ ఇన్‌చార్జ్ సత్తిరాజు ఆదిత్య కిరణ్, సభ్యులు పాల్గొన్నారు.

పదిలమైన ప్రణాళిక

- పరీక్షలకు 100 రోజుల యాక్షన్‌ప్లాన్
- విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక తరగతులు
- ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక ప్రణాళిక



ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు

అయినవిల్లి: విద్యార్థుల బంగారు భవితకు తొలి మెట్టు పదో తరగతి. అందుకే పది తరగతిలో విద్యార్థులు పదిలో టెన్షన్‌గా చదువుపై శ్రద్ధ కనబరుస్తారు. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధిస్తే ఇంటర్, డిగ్రీలో మంచి కోర్సులు ఎన్నుకుని వాటిలో రాణించడానికి అవకాశం ఉంటుంది. భవిష్యత్‌లో విద్యార్థులు ఎంచుకునే ప్రతి గ్రూపునకు పదో తరగతి మార్కులు ఎంతో కీలకం. దానికి అనుగుణంగానే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు నిరంతరం శ్రమిస్తూ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేలా ఎప్పటికప్పుడు అసైన్‌మెంట్లు, మాక్‌టెస్టులు పెడుతూ ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు.

విద్యాశాఖ 100 రోజల యాక్షన్ ప్లాన్ ఇలా..

- విద్యార్థులకు పరీక్షలంటే భయం తగ్గించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి స్లిప్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.
- ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో విద్యార్థులను గుర్తించి తృతీయ శ్రేణిలో ఉన్నవారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.
- వెనుకబడిన విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు తగిన సమయం కేటాయిస్తున్నారు.
- రోజూ ఉదయం 8.15 గంటల నుంచి 9.15 గంటల వరకూ, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ ప్రశాంత వాతావరణంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.
- ప్రస్తుతం పాఠశాలల్లో రివిజన్ టెస్టులు పరీక్షలు జరుగుతున్నాయి. కాగా జనవరి లేదా ఫిబ్రవరి మొదటి వారంలో సమ్మెటివ్–2 పరీక్షలు నిర్వహిస్తారు.

నియోజకవర్గంలో పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
అయినవిల్లి	11	611
అంబాజీపేట	9	423
మామిడికుదురు	12	518
పి.గన్నవరం	13	703
మొత్తం	45	2255

జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు...

పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో పి.గన్నవరం నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు కంకణం కట్టుకున్నారు. ఇందుకోసం విద్యా శాఖ పంపించిన నూతన టైమ్ టేబుల్ ప్రకారం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు బోధిస్తున్నారు. విద్యార్థుల్లో నూతన ఒరవడిని తీసుకొచ్చేందుకు విద్యాశాఖ 100 రోజుల యాక్షన్ ప్లాన్ తీసుకొచ్చింది. దీనిలో భాగంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో ఒక గంట పాటు ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో 45 ప్రభుత్వోన్నత పాఠశాలల్లో 2255 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే ఉపాధ్యాయులు సిలబస్‌ను పూర్తి చేశారు.

సిలబస్ రివిజన్ చేస్తున్నారు



ఉపాధ్యాయులు సాయంత్రం సమయంలో ప్రత్యేక తరగతులు నిర్వహించి సిలబస్ రివిజన్ చేస్తున్నారు. ఇక్కడే ఉండి చదువుకోవడం వల్ల తోటి విద్యార్థులతో పోటీపడి బాగా చదువుతున్నాను. నాకు గణితం, ఇంగ్లీషు అంటే బాగా ఇష్టం. ప్రత్యేక తరగతుల ద్వారా ఆ రెండు సబ్జెక్టులతో పాటు, మిగతా సబ్జెక్టుల్లో మరింత పట్టు సాధిస్తున్నాను.

– కుడుపూడి హరిత, పదో తరగతి విద్యార్థిని, ముక్తేశ్వరం

ప్రత్యేక తరగతులతో మేలు



ప్రత్యేక తరగతులు నిర్వహించడం వల్ల మాకు మరింత సమయం చదువుకునే అవకాశం కలుగుతోంది. మాకు వచ్చే సందేహాలను ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకుంటున్నాం. పరీక్షలు బాగా రాసి మంచి స్కోరు సాధిస్తాను.

– పీవీవీ మణిదీప్, పదో తరగతి విద్యార్థి, జెడ్పీ హైస్కూల్, ముక్తేశ్వరం

ప్రణాళిక అమలు చేస్తున్నాం



మండలంలోని అన్ని ప్రభుత్వోన్నత పాఠశాలల్లో వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నాం. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు యాక్షన్ ప్లాన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో అయినవిల్లి మండలం ప్రథమ స్థానంలో నిలవాలని ఆశిస్తున్నాం. పాఠ్యాంశాలపై ఏమైనా సందేహాలు ఉంటే విద్యార్థులు భయపడ కుండా ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలి.

– పితాని శ్రీనివాసు, ఎంఈఓ–2, అయినవిల్లి

అవగాహనతో ఎయిడ్స్ నిర్మూలన సాధ్యం

రావులపాలెం: ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉంటే నిర్మూలించడం సాధ్యమవుతుందని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ భరత్‌లక్ష్మి అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్ డిపోలో హెచ్ఐవీ, ఎయిడ్స్ సమాచారాన్ని అందించేందుకు ఐఈసీ స్టాల్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌లో కరపత్రాలు అందించడంతో ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థ విస్తృత ప్రచారం చేస్తుందన్నారు. రావులపాలెం డిపోలో వచ్చే శనివారం వరకూ ఈ స్టాల్ ఉంటుందన్నారు. ఎయిడ్స్‌పై సమాచారం తెలుసుకుని, లక్షణాలు ఉన్నవారు పరీక్షల కోసం సమీప ఏరియా ఆసుపత్రిలో హెచ్ఐవీ టెస్టులు చేయించుకోవాలన్నారు. పాజిటివ్ వచ్చిన వారికి జీవితకాలం మందులు అందించేందుకు ఏరియా ఆస్పత్రులు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ హెచ్ఐవీపై అవగాహన కలిగి నిర్మూలించడానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ అసిస్టెంట్ మేనేజర్ అచ్యుతాంబ, ఐసీటీసీ కౌన్సిలర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: విద్యాభివృద్ధికి దాతలు చేస్తున్న సాయాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలను పొందాలని అంబాజీపేట హైస్కూల్ హెచ్ఎం కదలి సాయిరాం సూచించారు. అంబాజీపేట హైస్కూలులో 91 మంది పదో తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్లను హైదరాబాద్‌కు చెందిన డీఎస్ శెట్టి, అన్నపూర్ణ దంపతులు సోమవారం అందజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ మార్చ్ 18 నుంచి జరగబోయే పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు ఈ మోడల్ పేపర్ల ద్వారా సంసిద్ధులై ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ మోడల్ పేపర్లను ఎస్ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, వైస్ చైర్మన్ బండారు అమ్మాజీ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెన్నపు సత్యనారాయణ, బి.వెంకటేశ్వరరావు, ఎస్‌వీఏఎస్ శర్మ, ఏవీఎల్ రామలింగేశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఓఎన్జీసీ పైపు లీకేజీ పనులను అడ్డుకున్న గ్రామస్తులు



నేదునూరు జోగివారిపాలెం వద్ద పైపులైన్ లీకైన ప్రదేశంలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

అయినవిల్లి: మండలంలోని నేదునూరు జోగివారి పాలెం నుంచి అంబాజీపేట మండలం పసుపల్లి గ్రామం మీదుగా వెళ్లిన ఓఎన్జీసీ పైపులైన్ పంట చేల మధ్యలో నాలుగు రోజుల కితం లీకైంది. దీంతో పైపు లైన్ నుంచి డీజిల్, క్రూడాయిల్, గ్యాస్ పైకి ఎగజిమ్మాయి. అయితే ఇంత జరుగుతున్నా ఓఎన్జీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. పైపులైన్ లీకేజీ అయిన ప్రదేశానికి దగ్గరలో జోగివారిపాలెంలో సుమారుగా 100 కుటుంబాల వారు జీవిస్తున్నారు. ఓఎన్జీసీ అధికారులు పైపులైన్ నిర్మాణ సమయంలో తమ పంటపొలాలకు వెళ్లేందుకు 1200 మీటర్ల మేర రహదారిని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారని గ్రామస్తులు చెబుతున్నారు. పలుమార్లు అధికారులను అడిగిన ఆ హామీ నెరవేరపోవడంతో పాటు పైపులైన్ లీకైజీ అయిన ఓఎన్జీసీ అధికారులు స్పందించక పోవడంతో ఆందోళన చేశారు. లీకైజీ అయిన చోట పైపులైన్‌కు మరమ్మతులు చేయడానికి వచ్చిన అధికారులను వారు అడ్డుకున్నారు. తమ పంటపొలాల్లో పైపులైన్ లీకై డీజిల్, క్రుడాయిల్, గ్యాస్ లీకై పంటలు పాడవుతున్నాయని, అలాగే ఓఎన్జీసీ పైపులైన్ వల్ల భవిషత్‌లో తమ ప్రాంతంకు ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆందోళన చేసిన వారిలో జోగి విశ్వేశ్వరరావు, బొక్కా రాంబాబు, జోగి భాస్కరరావు, జోగి సుధాకర్‌శెట్టి, కొప్పిశెట్టి వరహాలు తదితరులున్నారు. దీంతో దిగివచ్చిన ఓఎన్జీసీ అధికారులు, అయనవిల్లి పోలీసులు, స్థానిక తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ ఆధ్వర్యంలో స్థానికులతో చర్చలు జరిపారు. దీంతో చర్చల్లో తమ రహదారి నిర్మాణానికి నిధులిస్తామని ఓఎన్జీసీ అధికారులు ఒప్పుకోవడంతో ఆందోళనకారులు శాంతించారు.

పంచాయతీల పాలన మెరుగుపడాలి

మండల సమావేశంలో ఎమ్మెల్యే దేవ



మలికిపురం మండల సమావేశంలో సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే పంచాయతీల పాలన మెరుగైన రీతిలో ఉండాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం జరిగిన మలికిపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే దేవ పాల్గొని ప్రసంగించారు. అన్ని గ్రామ పంచాయతీలకు కార్యదర్శులు ఉండేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పలు గ్రామాల్లో తాగునీటి కుళాయిల సమస్యలపై ఆయా సర్పంచ్‌లు రాపాక ఆనందకుమార్, చెల్లుబోయిన హెలీనా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అలాగే విద్యుత్ లైన్లు, శిథిలమైన స్తంభాలు, లోవోల్టేజీ సమస్యలపై ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మలికిపురం సెంటర్‌లో మహిళలకు మరుగు వసతి కల్పించాలని కూడా కోరారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ఎంపీడీఓ ఎస్.బాలాజీ, తహసీల్దారు టి.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై పోరుబాట



కొత్తపేట డీఎస్పీ గోవిందరావుకు వినతిపత్రం ఇస్తున్న మాజీ మంత్రి సూర్యారావు

మామిడికుదురు: విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పోరుబాట చేపట్టామని మాజీ మంత్రి, రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు తెలిపారు. జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్య స్వగృహం వద్ద సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధిష్టానం ఆదేశాల మేరకు ఈ నెల 27వ తేదీ విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా మలికిపుంలో భారీ ఎత్తున ధర్నా నిర్వహిస్తామన్నారు. మలికిపురం సెంటర్‌లో దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయం వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. ఈ నిరసన కార్యక్రమానికి పార్టీ శ్రేణులు భారీగా హాజరు కావాలని ఆయన కోరారు. విద్యుత్ చార్జీలు పెంచే ప్రసక్తే లేదని ఎన్నికల సభలో వాగ్దానం చేసిన టీడీపీ అధినేత చంద్రబాబునాయకుడు, కూటమి నేతలు ఆ వాగ్దానాన్ని విస్మరించి ప్రజలపై విద్యుత్ భారం మోపారని సూర్యారావు తీవ్రంగా ధ్వజమెత్తారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా చేపట్టే ధర్నాకు అనుమతి కోరుతూ కొత్తపేట డీఎస్పీ గోవిందరావుకు వినతిపత్రం ఇచ్చామన్నారు. సమావేశంలో పార్టీ రాజోలు మండల శాఖ అధ్యక్షులు కట్టా శ్రీనివాస్, నెడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ పాటి శివకుమార్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సూరిశెట్టి బాబి పాల్గొన్నారు.

దేశానికి వెన్నెముక రైతులు



గుమ్మిలేరులో రైతులను సత్కరిస్తున్న సర్పంచ్ రాంబాబు తదితరులు

ఆలమూరు: దేశానికి పట్టుగొమ్మలు గ్రామీణ ప్రాంతాలైతే దేశానికి వెన్నెముక మాత్రం రైతులేనని గుమ్మిలేరు గ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబు అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం జాతీయ రైతు దినోత్సవం జరిగింది. ఈసందర్భంగా గ్రామంలోని పలువురు వృద్ధ రైతులకు పూలమాలలు, దుశ్శాలువా వేసి ఘనంగా సత్కరించారు. గ్రామంలోని రైతులందరికి జాతీయ రైతు దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానికి ఉన్న ప్రాధాన్యతను వివరించారు. ఇరుపునేడి పట్టాభి, రెడ్డి నారాయణరావు, యార్లగడ్డ వీర్రాజు, రెడ్డి పట్టాభి రామయ్య, గడ్డం వాసు, రైతులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత: వ్యక్తి అరెస్ట్

ఆలమూరు: గ్రామంలో గంజాయి తరలిస్తున్న బి.గణేష్ అరెస్ట్ జరిగింది. స్థానిక ఎస్సై ఎం.అశోక్ కథనం ప్రకారం జొన్నాడ నుంచి కోటిపల్లి వెళ్లే ఏటిగట్టు రోడ్డులో గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నిందితుడు గణేష్ వద్ద నుంచి 4.75 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలపై చంద్రబాదుడు పాలన

- మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ధ్వజం
- విద్యుత్ చార్జీల పెంపుపై ఈనెల 27న ఆందోళన
- వైఎస్సార్ సీపీ 'పోరుబాట' పోస్టర్ ఆవిష్కరణ



కొత్తపేటలో వైఎస్సార్ సీపీ పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: రాష్ట్రంలో జరుగుతున్నది చంద్రబాబు పాలన కాదని, చంద్రబాదుడు పాలనని కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీల పెంపుతో కూటమి ప్రభుత్వం ప్రజలపై అధిక భారాన్ని మోపడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని వైఎస్సార్ సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆ మేరకు ఈనెల 27న నియోజకవర్గంలో నిర్వహించే పోరుబాట పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆవిష్కరించారు. కొత్తపేటలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ నాయకుడు అముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు స్వగృహం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జగ్గిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ప్రజలపై అన్ని విధాలుగా మోయలేని భారం మోపుతోందని విమర్శించారు. అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజలపై బాధ్యత బాదుడు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు ప్రజలకు చంద్రబాబు అనేక హామీలిచ్చారని, అందులో భాగంగా తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీల పెంపుదల ఉండదని ప్రజలను నమ్మించారని గుర్తు చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోనే ప్రజలపై రూ.వేల కోట్ల భారాన్ని మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలోనూ విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజలను అనేక కష్టాలకు గురి చేసిన చరిత్ర చంద్రబాబుదని చెప్పారు. నేడు రాష్ట్రంలో మళ్లీ అదే చంద్రబాబు వల్ల విద్యుత్ చార్జీల భారాన్ని మోయలేక ప్రజల నడ్డి విరుగుతోందన్నారు. మొదటి దఫాగా రూ.6,072 కోట్లు, రెండో దఫాగా రూ.9,454 కోట్ల భారాన్ని విద్యుత్ చార్జీల పేరిట ప్రజలపై భారాన్ని మోపారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలకు అండగా వైఎస్సార్ సీపీ ఈ నెల 27న తలపెట్టిన నిరసన కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపడంతో పాటు పెద్ద ఎత్తున నిర్వహించే పోరుబాట కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు జి.రమాదేవి, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, సర్పంచులు రెడ్డి చంటి, సాగి బంగారాజు, ఎంపీటీసీలు పేపకాయల బ్రహ్మానందం, విళ్ళ వీర్రాజు, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్చార్జిలు మునునూరి వెంకటేశ్వరరావు, మట్టపర్తి వెంకట్రావు, గ్రామ పార్టీ అధ్యక్షులు సలాది బ్రహ్మాజీ, గొల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించాలి

ఆలమూరు: గ్రామీణ పీహెచ్‌సీల్లో ఏళ్ల తరబడి పని చేయించుకుని అర్ధాంతరంగా తొలగించబడిన హెల్త్ అసిస్టెంట్లను తిరిగి ప్రభుత్వం విధుల్లోకి తీసుకుని ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని మండల వైద్య ఆరోగ్య శాఖ డిమాండ్ చేసింది. మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల ఆవరణలో హెల్త్ అసిస్టెంట్లు చేపట్టిన నిరసన కార్యక్రమాలకు వైద్య ఆరోగ్యశాఖ తమ మద్దతు ప్రకటించింది. ఇటీవల రద్దు చేసిన హెల్త్ అసిస్టెంట్ల పోస్టులను మళ్లీ పునరుద్ధరించి యథావిధిగా ఉద్యోగాలు మళ్లీ ఇప్పించి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ హెల్త్ అసిస్టెంట్లు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్లకు సంఘీభావంగా స్థానిక పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న అధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు ర్యాలీలో పాల్గొన్నారు. హెల్త్ అసిస్టెంట్లు శాంతియుత పోరాటానికి ఎల్లప్పుడూ తమ మద్దతు ఉంటుందంటూ భరోసా ఇచ్చారు. అనంతరం తమ న్యాయమైన డిమాండ్లను వినతి పత్రం రూపంలో వైద్యాధికారి డి.సాయికిషోర్‌కు అందజేశారు. గత 22 యేళ్లుగా పెద ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలను అందించిన హెల్త్ అసిస్టెంట్లను రాత్రికి రాత్రి ఒక కలం పోటుతో తొలగించడం ప్రభుత్వానికి తగదంటూ హెల్త్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

గణిత మేధావి రామానుజన్



తొండవరంలో రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



మామిడికుదురులో విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న హెచ్ఎం తదితరులు

అంబాజీపేట: దేశానికి గణిత మేధావిగా శ్రీనివాస రామానుజన్ ఎంతో కీర్తి ప్రతిష్టలు సాధించారని హైస్కూలు హెచ్ఎం, పీవీ కేశవాచార్యులు అన్నారు. తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో గణిత దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. హెచ్ఎంతో పాటు గణిత శాస్త్ర స్కూల్ అసిస్టెంట్ గాదె శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు పాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్‌కు ఎంతో ఇష్టమైన సంఖ్య 1729 అని దీనిని రెండు ఘనముల మొత్తంగా రాయగల చిన్న సంఖ్య కావటంతో దీనిని ×రామానుజన్ సంఖ్య అంటారని వివరించారు. విద్యార్థులు రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మానుకొండ చంద్రరావు, పిల్లి త్రిమూర్తులు, పినిపే సత్యనారాయణ, కొంపెల్ల వాణి తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవాన్ని మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ హెచ్ఎం సీహెచ్ నిరంజని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, క్విజ్, తదితర పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు దాత (ఎన్నారై) నయినాల శ్రీనివాస్ అందించిన రూ.25 వేల విరాళంతో బహుమతులు అందించారు. శ్రీనివాస రామానుజన్ అందరికీ ఆదర్శనీయుడని ఈ సందర్భంగా రిటైర్డ్ హెచ్ఎం మైలవరపు రవీంద్రనాథ్, ఎస్ఎంసీ చైర్మన్ వేగి శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో దాత తండ్రి నయనాల తమ్మారావు, ఉపాధ్యాయులు మేడిచర్ల శ్రీనివాస్, దొంగ సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు

ఆలమూరు: మండలంలోని చెముడులంకలోని తిర్నాతి సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో చక్కని ప్రతిభను కనబర్చి అవార్డులను సాధించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్‌లోస్థానిక హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఎస్‌వీఎస్ఎస్ ప్రవీణ కుమార్, టీడీఎస్ మణికంఠ, జాన్ రూపేష్, ఏఎంఎస్ ఆర్ఎస్ దుర్గబాబు పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారందరూ త్వరలో ఢిల్లీలో జరగబోయే తంగ్ తా మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో పాల్గొననున్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు శిక్షణను ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ దండే సత్తిబాబును మాజీ సర్పంచ్ నాగిరెడ్డి వెంకటరత్నం, స్కూల్ కమిటీ చైర్మన్ నాగిరెడ్డి రాము, గ్రామస్తులు, ప్రధానోపాధ్యాయులు బి.శివరాంకుమార్, డి.సత్తిరాజు తదితరులు అభినందించారు.

కొంప ముంచుతున్న అల్పపీడనం

చినుకులతో రైతుల్లో కలవరం



మామిడికుదురు బైపాస్ రోడ్డుపై రైతులు ఆరబెట్టిన ధాన్యం

మామిడికుదురు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలహీన పడిందని, దీని కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులను కలవరపాటుకు గురి చేస్తోంది. అల్పపీడనం ప్రభావంతో సోమవారం పడిన చిరు జల్లులు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశాయి. మాయదారి అల్పపీడనం మా కొంపు ముంచుతోంది అంటూ రైతులు తీవ్రంగా మదన పడుతున్నారు.

మామిడికుదురు నుంచి మొగలికుదురు వరకు 216వ నంబర్ జాతీయ రహదారి బైపాస్ రోడ్డుపై ధాన్యం ఆరబెట్టారు. అల్పపీడనం కారణంగా పడుతున్న చినుకులతో ధాన్యం తడిసి పోయే అవకాశం ఉండడంతో రైతులు ఆదరాబాదరాగా ధాన్యం రాశులపై బరకాలు కప్పారు. కోత కోతడం ఒక ఎత్తు అయితే దాన్ని నూర్చడం, ధాన్యం ఆరబెట్టడం మరో ఎత్తుగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మామిడికుదురు, నగరం, పెదపట్నం, గెద్దాడ, మొగలికుదురు, ఆదుర్రు, లూటుకుర్రు, పాశర్లపూడి తదితర గ్రామాల్లో 20 శాతం పైగా పంట ఇంకా మాసూళ్లు చేయాల్సి ఉంది. దానిలో కొంత పంట కోత కోయాల్సి ఉంది. కొంత పంట పనలపై ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రతికూల వాతావరణం రైతులను తీవ్రంగా ఆందోళన పెడుతోంది. రైతును బతకనిచ్చేలా లేదు. డిసెంబర్ చివరి వారంలో కూడా వర్షమా అంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా అయితే పంట సాగు చేయడం కష్టమని రైతులు తీవ్రంగా మదన పడుతున్నారు.